# జ్ఞానోదయం!

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"హలో! కృష్ణా!వాటే ప్లెజంట్ సర్ప్రయిజ్... హైదరాబాద్ నుంచేనా?.... ఏమిటి విశేషం?.... బెంగుళూరొస్తున్నావా? హార్టీ వెల్కం.. రేఖకి పెళ్లి సంబంధమంటున్నావు, వాళ్ళుండేదెక్కడ?... శేషాద్రిపురమా! అంటే మేముంటున్న కాలనీయే... ఆయనా! అబ్బో కుబేరుడు! మీ డాడీకేం తీసిపోడు.... ఎల్లుండి మార్నింగ్ ఫ్లయిట్కి నా వేన్ తీసుకుని ఎయిర్పోర్ట్కొస్తాను.. వేన్ సరుకులు మోసేదే అయినా ఫ్రంట్ సీట్లో నువ్వూ, రేఖా దర్జాగా కూర్చోటానికి చోటుంది, నేను డ్రయివ్ చేస్తాను. టేక్సీ ఎందుకురా, నేనెలాగా వేన్లో వస్తానుగా!.... హోటల్లో దిగుతారా!.. సిగ్గు లేదురా ఆ మాటనడానికి!... ఉండు మా అమ్మని పిలుస్తా.... మీ డాడీ నీ మొహం తగలేస్తే, ఇక్కడ మంచి ప్లాస్టిక్సర్జరీ చేసే... అదేం కుదరదు. ముందు మా ఇంటికొస్తున్నారు.. బైబై"

* * *

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"గుడ్ మార్నింగ్ డాడీ! ఇక్కడికి రాగానే పెళ్లి వారింటికెళ్లాను. ఇంకో సంబంధమోదో ఉందని తెలిసి, ఇవాళ ఎర్లీ మార్నింగ్ ఫ్లయిట్లో మెడ్రాస్ వెళ్లారు... పెళ్లి కొడుకూ అతని తల్లీ, తండ్రీ.... ఈ సాయంత్రం తిరిగొచ్చేస్తారు. ఈ సాయంత్రం రేపు తిథి వారాలు మంచివి కావుట. ఎల్లుండి పొద్దున్నే ఫోన్చేస్తే పెళ్లి కొడుకు రేఖని ఎప్పుడు చూసేది చెబుతానన్నారు.... పెళ్లి కొడుకు తాతగారు. రేఖని వాళ్లింటికే తీసుకు రమ్మన్నారు. పిల్ల నచ్చితే వెంటనే నిశ్చితార్థ చేసుకుని వారం రోజుల్లో స్టేట్స్కి తిరిగి వెళ్లిపోయి మళ్లీ రెండు నెలల్లో వొచ్చి పెళ్లి చేసుకుంటాడుట... మన సంబంధం టాప్ ప్రయార్టీ లిస్ట్లోనే ఉందని ఆ ముసలాయన చెప్పారు.. రేఖ అమ్మకి ఫోన్ చేసిందా!.. నా క్లాస్మేట్ మధు అని.. వీడి తండ్రి హైదరాబాద్లోనే కస్టమ్స్ డిపార్ట్మెంట్లో ఉంటూపోయారు.. వీడి తల్లిపద్మావతిగారు మమ్మీకి బాగా తెలుసు... సారీ డాడీ వాడు ఎయిర్పోర్ట్ కొచ్చి బలవంతం చేస్తే.. అలాగే, సాయంత్రం ఏదైనా మంచి హోటల్కి వెళ్లిపోయి ఫోన్ చేస్తాను.

* * *

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"హలో, మమ్మీ! హోటల్లో దిగకుండా ఓ స్నేహితుడింటికి తీసుకొచ్చినందుకు డాడీ అన్నయ్య మీద మండిపడ్డారుట. ఇక్కడ వాళ్లగెస్ట్ రూంలో ఉంటున్నాం. చాలా సౌకర్యంగా, కాలక్షేపంగా, సరదాగాఉంది. తల్లీ కొడుకుఎంతో మర్యాదస్తులు... అవును మీ స్నేహాన్ని గురించి చెప్పింది. నలభై మంది లేడీ వర్కర్స్‌నిపెట్టి మధు ఒక ఫుడ్‌ప్రోడక్ట్ స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ.. 'నందినీ ఫాస్ట్ ఫుడ్స్' అని చాలాబాగా నడుపుతున్నాడు. వెళ్ళి చూసొచ్చాము. మళ్లీ రేపు కూడా వెళ్లి స్టడీచేస్తాను... ఏమిటి మమ్మీ.... నువ్వు కూడా హోటల్ అంటావు! మేమెక్కడికీ వెళ్లం. ఇక్కడే ఉంటాం.... ఆ పెళ్లి కొడుకుని మేమెప్పుడు దర్శించుకోవాలో ఎల్లుండి చెబుతారుట. అంతవరకూ ఏ ఫైవ్‌స్టార్ హోటల్లోనో టి. వి. చూస్తూ కూర్చోవాలా! పైగా ఈ పెళ్లి చూపులు తతంగం సుఖాంతం అయ్యేవరకూ గోప్యంగా ఉండాలనీ, ఇక్కడున్న బంధుమిత్రుల్నీ కలవొద్దనీ డాడీయే చెప్పారు.. ఏ హోటల్లో దిగినా ఎవరో ఒకరు కుశలప్రశ్న లెయ్యడం తథ్యం. ఇదే భద్రమైన అజ్ఞాతవాసం.. డాడీకి చెప్పు.. అవును. మధుకి పెళ్లికాలేదు... ఓ అదా మీ భయం. అయినా ఇంతమంచి అయిడియా నాకెందుకు తట్టలేదా అని ఆలోచిస్తున్నాను... నిజమే మధుకి మంచి చదువు, సంస్కారం ఉన్నాయి... స్వయం కృషితో ఇంకా ఇంకా పైకెళ్లే అవకాశం ఉంది... అబ్బ! నాకు జ్ఞానోదయమై ఇంక ఆ సంబంధం చూడ్డం మానేస్తాననుకుంటున్నావా!... ఇక్కడ ఉండటంలో తప్పులేదంటున్నాను. ఎంత రూపవంతుడైనా, గుణవంతుడైనా, డాడీకి కావాల్సిన కోటీశ్వరుడు కాదుగదా!.. రేపు ఆ సంబంధం స్థిరపడితే డాడీఅపోహలన్నీ మటుమాయమైపోతాయి.. గుడ్‌నైట్.

★ ★ ★

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"ఎస్.. కృష్ణా! మీ స్నేహితుడింట్లోనే ఉంటామని రేఖ ఫోన్ చేసిందిట. దానికి బుద్ధిలేకపోతే నీకైనా బుద్ధిలేదూ! నువ్వాక్కడివీవెడితే ఏ స్లమ్ ఏరియాలో ఉన్నా ఐ డోంట్ కేర్. నాకిక్కడ డైరెక్టర్స్ మీటింగ్ ఉండటం వల్ల... మరి చెబితే వినిపించుకోవేమిటి! నీకు వాళ్లు ఫోన్ చెయ్యాలన్నా, పిల్లని చూడ్డానికి వాళ్ల బంధువు లెవరైనా రావాలనుకున్నా, పిల్లని వెంట బెట్టుకు రమ్మని వాళ్లెవరైనా కారు పంపుతానన్నా, తిథివార నక్షత్రాలేమిటి పిల్లలని కలవడానికి. నాన్‌సెన్స్, అని పెళ్లి కొడుకు అన్నా.. ఈ అడ్రస్ ఫోన్ నంబరు ఇస్తావా!.. నో మోర్ డిల్లీ డాలీయింగ్. వెంటనే ఏదో ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో రెండుసూట్లు

బుక్‌చెయ్యి.. ఎక్కడున్నదీ వాళ్లకి కూడా చెప్పు.. రేపు మార్నింగ్ ఫ్లయిట్‌లో నేనూ వసంతా ఒస్తున్నాం.. అప్పటికి పెళ్లి చూపులైపోయినా అవ్వకపోయినా, వాళ్లని లంచ్‌కిపిలుద్దాం.. సరే నీ ఫోన్ కోసం వెయిట్ చేస్తూ ఉంటాను.

★ ★ ★

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"మమ్మీ! గుడ్ మార్నింగ్. పొద్దున్నే అన్నయ్య ఫోన్ చేస్తే వెంటనే ఎనిమిదింటికల్లా రమ్మన్నారు... చాలా గౌరవ మర్యాదల్తో నన్నూ అన్నయ్యనీ రిసీవ్ చేసుకున్నారు. నేనూ అతనూ ఓ అరగంట ఏకాంతంగా, చాలా విషయాలు మాట్లాడుకున్నాం.. మరో ముఖ్యమైన పనేదో ఉన్నట్టుంది.. అతను లేచాడు. "మీరు మొన్న మద్రాస్‌లో చూడ్డానికి వెళ్లిన సంబంధం స్థిరపరచుకొచ్చేరనుకుంటాను... అవునా?" అని అడిగాను. అతను నా సూక్ష్మబుద్ధిని అభినందించి అవునని, ఆ సంబంధం వివరాలు చెప్పాడు. అతన్ని అభినందించి తిరిగొచ్చేశాం.. వాళ్ల తప్పేముంది!.. అది చాలా మంచి సంబంధం.. అవన్నీ చెబుతానుగా!.. ఇంకా టైముంది కనక మీ ఫ్లయిట్ టిక్కెట్టు కేన్సిల్ చేసుకోండి.. మేము సాయంత్రం ఫ్లయిట్‌లో తిరిగొస్తున్నాం... బై"

★ ★ ★

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"వసంతగారా!.. నేను పద్మావతిని బెంగుళూరు నుంచి... నమస్కారం.. అయ్యో! ఎంతమాట? కృతజ్ఞతలంటారేమిటి!.. కృష్ణ రేఖ మా ఇంటికి రావడం మా అదృష్టం... పోనీ ఆ విధంగానైనా వచ్చారు. మా ఇంట్లో దిగినందుకు ఆ సంబంధం కుదిరిపోతే మరింత సంతోషంగా ఉండేది... దైవసంకల్పమే అనుకోండి.... రేఖకేమిటి బంగారు బొమ్మ.... అదికాకపోతే దాని తలదన్నే సంబంధమొస్తుంది.. అయితే మా ఇండస్ట్రీ తాలూకు కిటుకులన్నీ రేఖ మీకు చెప్పేసిందన్నమాట!.. తను కూడా ఏప్రనూ, గ్లవుసూ వేసుకుని కిచెన్‌లోనూ పేకింగ్‌లోనూ చొరబడేది.. మాకిక్కడో ఫ్లేట్ ఉంది.. ఆయన పోయాక ఆ ఉద్యోగమేదో ఇక్కడే వెతుక్కోవచ్చునని ఒచ్చేశాం... ఓ స్నేహితుడు స్టేట్స్‌కి వెళ్లిపోతూ ఈ వ్యాపారాన్ని మా మధుకి ఇచ్చేశాడు... దానితో మా దశ కాస్త తిరిగి ఇప్పుడు స్థిరపడింది... మధు పెళ్లి మాటా?.. ఈ వ్యాపారంలో అభిరుచి ఉండి తనకి సాయంగా ఉండే అమ్మాయి దొరికినప్పుడు చేసుకుంటాడుట... తప్పకుండా వస్తాం... రేఖ పెళ్లికొచ్చి వారం రోజులుంటాం.. శలవు."

★ ★ ★

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"హలో మధూ!.. రేఖకి పెద్ద డిసప్పాయింట్‌మెంటేమీలేదు. మొన్న చూసింది నాలుగో సంబంధం... అదేం కాదు. రెండు వాళ్లకి నచ్చలేదు, రెండు దీనికి నచ్చలేదు.. ఇంతకీ అసలు విషయం చెప్పనియ్యి. నువ్వు దాని కన్నివిధాలా నచ్చేవుట... నువ్వు 'ఊఁ' అంటే మా డాడీతో యుద్ధం చేసైనా నిన్ను పెళ్లి చేసుకుంటానని నా దగ్గిర ఒకటేగొడవ... నీతో చెప్పిందిట కదా!.... ఆ మాటా చెప్పింది." ఇలాంటి పెళ్లిళ్లు సినిమాల్లో జరుగుతాయి. బుద్ధిగా ఇంటికి వెళ్లి మీ డాడీ చూసే సంబంధాల్లో నచ్చినవాణ్ణి చేసుకో.. మన పెళ్లి మాటెత్తేవంటే, ఇదంతా మీ అన్నయ్యా నేనూ ఆలోచించి ఆడిన నాటకం అనుకుంటారు" అని గట్టిగా మందలించేవుటగా! అది సరే.. మరో కోటీశ్వరుడి సంబంధం దొరకాలి.. దానికి నచ్చాలి.. రేఖ చాలా పెంకి ఘటం.. అది ఎంతకైనా తెగిస్తుంది.. కొన్నాళ్లు దాని నోరు మూయిస్తాను.. నీకిష్టం లేదని అబద్ధమాడమంటావా! ... ఏమో నాకు నమ్మకం లేదు. ఏ క్షణాన ఏం చేస్తుందోనని నాకు దినదినగండంలా ఉంది... థేంక్స్ ఫర్ ఎవ్విరీ థింగ్. ఆంటీకి నా నమస్కారాలు చెప్పు"

★ ★ ★

ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"నమస్కారం పద్మావతిగారూ! నేను వసంతని.. ఈ శుభవార్త వింటే మీరు ఎంతో సంతోషిస్తారని నాకు తెలుసు. రెండు వారాల క్రితం రేఖ మీ ఇట్లో దిగినప్పుడు, ఆ సంబంధం తప్పిపోయినందుకు నిరుత్సాహపడ్డారు. ఇప్పుడంతకంటే మంచి సంబంధమే దొరికింది. పిల్లాపిల్లాడూ చూసుకున్నారు. ఇద్దరూ ఇష్టపడ్డారు. నిశ్చితార్థ తతంగం కూడా అఖ్ఖర్లేదు. అరమరికలు లేని సంబంధం. ఇక పెళ్లి ముహూర్తం పెట్టడమే తరువాయి... పెళ్లికొడుకు మాజీ మంత్రి మాధవరావుగారబ్బాయి... స్టేట్స్‌లో మంచి ఉద్యోగంలో ఉన్నాడు... మాట తప్పకుండా వారం రోజులు ముందరే రావాలి... థేంక్స్."

** రచన, జూలై, 2002*

కథా నిలయం
శ్రీకాకుళం